
హైదరాబాద్ వార్త



## కూరగాయల ధరలతో ప్రజలు బెంబేలు

✦ మాంసాహారం వైపు మొగ్గు

✦ చికెన్, ఫిష్ కోసం పోటీపడుతోన్న జనం



కూరగాయలు, నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్యతరగతిపై భారం పడుతోంది. బోనాల వేడుకలు కావడంతో నాన్ వెజ్‌కి ప్రిఫర్ ఎక్కువ చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చికెన్, ఫిష్‌తో పాటు టమోటా, పచ్చిమిర్చి రేట్లు పోటీ పడుతున్నాయి. కొనుగోళ్లు లేక కూరగాయల మార్కెట్లు వెలవెల బోతున్నాయి. ప్రజలు కూడా కూరగాయల బదులు ఆదే రేట్లో చికెన్ రావటంతో చికెన్ కొనటానికి మొగ్గు చూపుతున్నారు. ఇప్పటివరకూ సినిమా టికెట్లకోసం క్యూల్లో నిలుచున్న వైనం చూసాం. అలాగే ఆసుపత్రి ఔట్‌పేషెంట్ వార్డుల్లోకూడా క్యూలు కనిపిస్తాయి. అటువంటిది టమో టాలు కొనుగోలుచేయడానికి ప్రజలు క్యూల్లో నిలుచుని కొనుగోలు చేసుకోవాల్సి వచ్చిందంటే ఎందుకంత భారంగా మారాయన్నది ఎవ్వరికీ అంతుబట్టడంలేదు.

హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త : కూరగాయలు వద్దు.. నాన్‌వెజ్ నయం అంటున్నారు వినియోగదారులు. రోజు రోజుకు మండిపోతున్న కూరగాయల ధరలతో పోలిస్తే వాటి కంటే చికెన్, ఫిష్ బెటర్ అని చెబుతున్నారు. కొద్ది రోజులుగా టమోటా కేజీ రూ.150 నుంచి 160 వరకు పలుకుతోంది. పచ్చి మిర్చి కేజీ రూ.160 పైగా రూ.200 వరకు పలుకుతోంది. పెరుగుతున్నాయే తప్పా..రేట్లు కిందికి దిగడం లేదు. దీనితో ఫిష్ కేజీ రూ.150, చికెన్ రూ.220 ఉండే కొన్ని చోట్ల రూ.180కి కూడా అమ్ముతున్నారు. అందుకే నాన్‌వెజ్ వైపు మొగ్గు చూపుతున్నారు. టమోటాల దిగుబడి తగ్గిందాఅంటే అదికూడా కాదు. కృత్రిమ కొరతను సృష్టించి టోకు వ్యాపారులు ధరలను అమాంతంపెంచేసారన్న ఆరోపణలు వస్తున్నాయి. అందువల్లనే బాక్సు టమోటా ఇపుడు 2200 వరకూ రేటు పలుకుతోంది. ఈలెక్కన చూస్తే ఎకరా సాగుచేసిన రైతు తన దిగుబడి ఆధారంగా 60 లక్షలకుపైగానే లబ్దిపొందుతున్నాడు. మంచిదే కానీ ఇదే అదునుగా టోకు మండిల్లో ధరలు మండిపోతున్నాయి. చివరకు రిటైల్‌స్థాయికి మరింతపెరిగి వినియోగదారుడిచేతికి వచ్చేసరికి అసలు ధరకు మూడురెట్లుపెట్టి కొనుగోలుచేయాల్సి వస్తోంది. వీటితోపాటే కూరల్లో ఎక్కువ వినియోగించే పచ్చి మిర్చి, కొత్తిమీర, కరివేపాకులు సైతం కొండెక్కుతున్నాయి. దిగుబడి లేదని, సాగు తగ్గిందని సాకులు చెపుతూ వ్యాపారులు వీటినిసైతం పెంచేస్తున్నారు. ఒకవేళ నాన్‌వెజ్ వంటకాలకు వెళదామన్నా పచ్చిమిర్చి కారం లేకుండా కూరలే ఉండవు. అందువల్ల ఈ సీజన్‌లో అందులోనూ బోనాలు కావడంతో మాంసాహా ర ప్రియులు ఎక్కువగా కొనుగోలుచేస్తుంటారు. దీనితో చికెన్, మటన్ రిటైల్‌ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. కూరగాయలతో పచ్చిమిర్చికి సబ్సిడీ రేటు ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర సరుకుల రేట్లను తగ్గించాలని కోరుతు న్నారు. టమోటా కారణంగా ఇపుడు ఇతర కూరగాయల రేట్లుసైతం పెరిగిపోతు న్నాయి. కృత్రిమ కొరతను అరికట్టాలంటే టాస్క్‌ఫోర్స్,విజిలెన్స్ విభాగాలు దాడులు సోదాలు షురూచేయాలి. పట్టుబడినపక్షంలో ముందు తొలి తప్పుగా భావిస్తూ భారీ జరిమానాలుసైతం విధించే సాంప్రదాయం ఉంది. కనీసం ఆచర్యల వల్ల అయినా సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసర వస్తువులపరంగా కొంత ఊరట లభిస్తుందని నిష్కర్షగా చెప్పవచ్చు. కూరగాయ లపరంగా టమోటా, ఆలుగడ్డలు,వంకాయ, బెండ, మునక్కాయలు విరివిగాకొం టారు. సాంబారుప్రియులైతే చిన్న ఉల్లిగడ్డలతోపాటు బంగాళా దుంపలు, ముల్లంగి, క్యారట్ వంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతంఅవి కూడా కొండెక్కుతుండటంతో ఇక సామాన్యుడు కొనేదెలా? తినేదెలా? అన్నట్లుగా వాతావరణం మారిపోయింది. బోనాల వేడుకలు ప్రారంభం నుంచి కూడా నిత్యావసరాలకు ధరలు పెరిగాయంటే అవాస్తవం కాదు. గతంలో గల్లీకి ఒకటి, కూడలికి రెండు అన్నట్లుగా ఉండే కూరగాయల దుకాణాలు ఇక ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. ఈ ధరాఘాతం అధిగమించాలంటే ప్రభుత్వమే నేరుగా గల్లీల్లో విక్రయాలను ప్రారంభించాలి. రైతు బజార్లు గల్లీల్లోకి రావాలి. మొబైల్ బండ్లను ప్రవేశపెట్టి వ్యవసాయ ఉద్యానవన, మార్కెటింగ్ శాఖలు చొరవ తీసుకోకపోతే రానున్న రోజుల్లో మరింతగా కూరగాయలు ప్రియం అవుతాయనడంలో ఎలాంటి సందేహంలేదు.

## అర్ధరాత్రి తల్వార్లతో హల్‌చల్

### జ్యూస్ సెంటర్‌పై దాడి, అద్దాలు ధ్వంసం



తల్వార్లతో హల్‌చల్ చేసిన యువకులు

మెహిదీపట్నం, జులై 17, ప్రభాతవార్త : దుకాణ వివాదంలో తలెత్తిన గొడవలతో ముగ్గురు యువకులు ఆదివారం అర్ధరాత్రి తల్వార్లతో హల్‌చల్ చేశారు. ఈ సంఘటనలతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లెపల్లి బడీ మసీద్ సమీపంలో సిద్దిఖీ బిన్ ఓమర్, సమ్మర్ ల్యాండ్ జూస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దుకాణ విషయంలో సోదరుడు అస్లం బీన్‌తో ఓమర్‌కు కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. తండ్రి నుంచి తనకు సక్రమించిన దుకాణంను అస్లం బీన్ ఒమర్ కొందరికి విక్రయించాడు. దీంతో మనస్పర్ధలు మరింత పెరగడంతో నెల క్రితం ఇద్దరు సోదరులు పరస్పరం హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. సివిల్ కేస్ కావడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. ఆదివారం అర్ధరాత్రి రెండు బైక్‌లపై నలుగురు వ్యక్తులు వచ్చి తల్వార్‌లు తిప్పుతూ సిద్దిఖీ బిన్ ఓమర్‌ను బెదిరించారు. జ్యూస్ సెంటర్ అద్దారు పగులగొట్టి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ప్రాణాలు తీస్తామంటూ బెదిరించి వెళ్లిపోయారు. దుండగుల నుంచి తప్పించుకున్న బాధితుడు హబీబ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. అదే విషయంలో దుకాణాన్ని కొనుగోలు చేసిన హాజీం, వసీం అక్కడే ఉండడంతో బాధితుడు ఉలిక్కిపాటుకు గురయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## తార్నాకలో కత్తులతో మైనర్ల వీరంగం

**తార్నాక..** తార్నాకలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో అపశృతి జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఇన్స్‌పెక్టర్ భాస్కర్ వివరాల ప్రకారం. తార్నాక స్ట్రీట్ నెం.11లో ఉన్న అమ్మవారి ఆలయ నిర్వాహకులు, స్థానికులు బోనాల ఉత్సవాల్లో భాగంగా రాత్రి పలహారం బండి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. కాగా తార్నాక చింతల్, లాలాపేట్, మెట్టుగూడ ప్రాంతానికి చెందిన కొంత మంది మైనర్లు కూడా ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు సెయింట్ ఆన్స్ స్కూల్ వద్దకు చేరుకుంది. పోతరాజులతో కలిసి నృత్యాలు చేస్తున్నక్రమంలో ఒకరికొకరి మధ్య తోపులాట జరిగింది. దీంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న మైనర్లు ఆగ్రహం తో అకస్మాత్తుగా కత్తులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకొని పొడుచుకున్నారు. ఈ ధాడిలో ముగ్గురి మైనర్లకు గాయాలయ్యాయి. వీరిని పోలీసులు వెంటనే గాంధీకి తరలించారు. ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు తెలిసింది. ధాడికి పాల్పడిన వారి గురించి పోలీసులు గాలిస్తున్నారు. ముగ్గురు అదుపులో ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా మాతేశ్వరి ఘటాల ఊరేగింపు

✦ అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారికి సిపి సి.వి.ఆనంద్ పూజలు

✦ ఏనుగు అంబారీపై ఊరేగింపును ప్రారంభించిన నగర సిపి

డప్పుల దరువులు, బాజా భజంత్రీలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు, పూలు,పండ్లతో అలంకరించిన మాతేశ్వరీ అమ్మవారి ఘటాల వాహనాలు.. ఏనుగు అంబారీపై ఊరేగించిన అక్కన్న మాదన్న శ్రీ మహంకాళీ అమ్మవారి ఘటం, వివిధ దేవాలయాలకు చెందిన ఘటాల సామూహిక ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగింది. ఘటాలను చూసి పాతబస్తీ ప్రజలు ఆధ్యాత్మికతకు లోన య్యారు. సామూహిక ఘటాల ఊరేగింపులో అడుగడుగునా వివిధ దేవాలయాల కమిటీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నుంచి ఘటాలకు స్వాగతం పలికారు.



అక్కన్న మాదన్న ఆలయం నుంచి చార్మినార్ వరకు అంబారీ ఊరేగింపు (ఇన్‌సెట్‌లో ఏనుగు)

### నాకు ఆటంకాలు కలిగిస్తున్నారు

**నేను అడిగినవి ఏమీ తీర్చడం లేదు**

**ఎవ్వరిని ఎంతవరకు కాపాడుకోవాలో**

**అంత వరకు కాపాడుకుంటా..**

**ఎవ్వరు తప్పుచేసిన శిక్షలకు వారే అనుభవిస్తారు**

**లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి భవిష్యవాణి**

**వినిపించిన మాతంగి అనురాధ**



చాంద్రాయణగుట్ట : లాల్‌దర్వాజ సింహవాహిణి మహాంకాళి అమ్మవారి బోనాల జాతరలో ముఖ్యమైన ఘట్టం భవిష్యవాణి (రంగం)ను అమ్మవారి భక్తురాలు అనురాధ సాయంత్రం 7 గంటలకు వినిపించారు. పండుగలో అత్యంత ప్రాధాన్యత కలిగిన భవిష్యవాణిని వినేందుకు వేలాది మంది భక్తులు అమ్మవారి అలయం వద్దకు విచ్చేశారు. అమ్మవారి ఆలయం ముందు పచ్చికుండపై నిలబడి అమ్మవారిని అవహింపజేసుకున్న అనురాధను ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మాణిక్ ప్రభుగౌడ్ అడిగిన ప్రశ్న లకు సమాధానాలు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించినందుకు అనందంగా ఉంద న్నారు. నాకు మీరు చాలా ఆటంకాలు కలిగిస్తున్నారని, నేను అడిగినవి ఏమి తీర్చడంలేదని మాతంగి ప్రశ్నించారు. మిమ్మల్ని నేను చల్లంగా చేసుకుంటాను కాని చిన్నచిన్న తప్పులు చేసి పెద్ద ముప్పులు తెచ్చుకుం టున్నారు. ఆలయం వద్ద ధ్వజ స్తంభం ఏర్పాటు చేయండి.

ఎవరిని ఎంత వరకు కాపాడాలో అంతవరకు కాపాడుకుంటాను. ఎవరు చేసిన తప్పులకు వారే అనుభవిస్తారని తెలిపింది. నాకు పూజలు చేస్తున్న ప్రతి ఒక్కరిని కాపాడుకుంటానని చెప్పింది. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలంటే ఐదు వారాలు నైవేద్యం, కుంకుమ పసుపు, సాక పోసి శాంతి పూజలు చేయాలి మాతంగి అనురాధ భవిష్యవాణి వినిపించారు.



సిపికి ఆశీర్వాదం చేస్తున్న గజరాజు

చార్మినార్, జులై 17 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో సోమవారం రాత్రి భారీ పోలీస్ బందోబస్తు మధ్య శ్రీ మహంకాళీ అమ్మ వారి ఘటాల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది.కాగా ఊరేగింపును వేలాది మంది భక్తులు తిలకించటానికి తరలి రావటంతో ప్రధాన రహదారులు కిక్కిరిసి పోయాయి.రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి ఊరేగింపుగా వచ్చిన ఘటాలకు స్వాగతం పలికారు.నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ సోమవారం సాయంత్రం శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం లో పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఊపి ఘటం ఊరేగింపును ప్రారంభించారు.శ్రీ అక్కన్న మాదన్న మహాంకాళీ మందిరం, శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం.దూద్‌బౌలిలోని ఉందా బజార్ శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయం,కసారట్ట శ్రీ నల్ల పోచమ్మ మందిరం,మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర మందిరంతో పాటు పాతనగరంలోని పలుప్రాంతాల దేవాలయాలకు చెందిన అమ్మ వారి ఘటాలు ఊరేగింపు చార్మినార్ వద్ద కలిసాయి.చార్మినార్,గుల్జారాహౌస్,మదీనా ప్రాంతాలు మీదుగా నయాపూలోని శ్రీ మహంకాళీ అమ్మ వారి దేవాలయానికి అమ్మవారి ఘటాల ఊరేగింపు చేరుకుంది.పూజలు నిర్వహించిన అనంతరం తొట్టెలను సమర్పించారు.మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర మందిరం కమిటి ఆధ్వర్యంలో జరిగిన అమ్మ వారి ఘటం ఊరేగింపు ఎంతగానో ఆకట్టుకుంది.పలు రకాల అమ్మవారి వేషధారణాలను భక్తులు ఎంతో ఆసక్తితో తిలకించారు.



సోమవారం జరిగిన అమ్మ వారి ఘటాల ఊరేగింపు ను పుర స్కరించుకుని పాతబస్తీలోని అన్ని ప్రాంతాలలో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మొహరింప చేశారు. వాటర్ వర్క్స్ శాఖ అధ్వర్యంలో పలు ప్రధాన రహదారులలో టెంట్‌లను ఏర్పాటు చేసి వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఊరేగింపులో శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం కమిటి ప్రధాన కార్యదర్శి మధుసూదన్ యాదవ్,శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ దేవాలయం కమిటి అధ్యక్షులు రామ్‌దేవ్ అగర్వాల్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఊరేగింపు లో ప్రదర్శిం చిన పలు రకాల వేషధారణాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## పెరిగిన ధరలను తగ్గించాలని మహిళల ప్రదర్శన



సైఫాబాద్, జులై 17 ప్రభాతవార్త: రాష్ట్రంలో పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది మహిళలు సోమవారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో వినూత్న ప్రదర్శన నిర్వహించారు. కూరగాయల హారాలను ధరించి ప్లకార్డులను చేబూని పెరిగిన వంటగ్యాస్, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య, తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ పెరిగిన ధరలతో పేద, సామన్యప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. లీటర్ పెట్రోల్ కంటే టమాటా ధర ఎక్కువగా ఉందన్నారు. పెరిగిన ధరలను తగ్గించకపోతే భారత దేశం మరో శ్రీలంక, పాకిస్తాన్‌లో వలే సంక్షోభంలో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆమె అన్నారు. ఈ ప్రదర్శనలో సమాఖ్య ప్రతినిధులు ఉస్తెల సృజన, జ్యోతి, సదాలక్ష్మి, ఛాయాదేవి, పదాల నళిని, నందూరి కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నగరం ఫ్లెక్సీలమయం

➢ ఫ్లెక్సీ కాలుష్యం, నగర వ్యాప్తంగా లక్షకుపైగా ఫ్లెక్సీలు

➢ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎక్కడ?

➢ గతంలో జరిమానాలు విధించారు.. మరి ఇప్పుడు ఎందుకు మరిచారు?

ఫ్లెక్సీల కారణంగా పర్యావరణ కాలుష్యం అవుతుందని, ఫ్లెక్సీల విషయంలో కఠినంగా వ్యవహరించాలని గతంలో న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కానీ అధికారులు ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. బోనాల పండగ సందర్భంగా గల్లీ, గల్లీ మొదలు కాలనీల వరకు వందల సంఖ్యలో ఫ్లెక్సీలు వెలిసాయి.



హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త : హైదరాబాద్ మహానగరంలో ఫెక్సీ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుంది. చిన్ని చిన్న కాలనీలు మొదలు ప్రధాన రహదారులపై అదే పరిస్థితి నెలకొంది. గతంలో న్యాయస్థానాలు ఆదేశించి నప్పుడు హడావుడి చేసి జిహెచ్‌ఎంసి అధికారులు ఇప్పుడు మాత్రం అధికారులు మరిచిపోయారు. రహదారులపై ఎక్కడ ఫెక్సీలు కనిపించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు జరిమానాలు విధించారు. ఆ తరువాత మరిచిపోయారు. దీంతో నగరంలో ఎక్కడ చూసిన ఫెక్సీలు కనిపిస్తున్నా యి. మరోవైపు ఈ ఫెక్సీలు ఊడిపోయి ప్రమా దాలు జరుగుతున్న సంఘటనలు సైతం కనిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో, జరిమానాలు ఎందుకు విధించడం లేదన్న ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ప్రారంభోత్సవాలు, నాయకులకు ఆహ్వానాలు, పండగలు ఇలా ఏదో ఒక విదంగా కాలనీలలో విచ్చల విడిగా ఫెక్సీలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాలలో దాదాపు లక్షకుపైగా ఫెక్సీలు వెలిసాయంటే ఎంత పర్యావరణ కాలుష్యానికి కారణమైందో తెలిసిపోతుంది.

నగరంలో ఫెక్సీలను తొలగించడంతో పాటు ఫెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిహెచ్‌ఎంసి మున్సిపల్ చట్టం ప్రకారం జరిమానాలు సైతం విధించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారు అవుతారని పర్యావరణ నిపుణులు అంటున్నారు.

## 19వ తేదీ నుండి రెండు రోజులు నీటి సరఫరా బంద్



హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త : నగరంలోని పలు ప్రాంతాల్లో రెండు రోజుల పాటు తాగునీటికి అంతరాయం కలగనుంది. హైదరాబాద్‌కు తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్-1లో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని ముర్మూర్ నుంచి బొమ్మకల్ వరకు ఉన్న 3వేల ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్ పైపులైనుకు 22.4 కి.మీ, 24.05కిలోమీటర్ల దగ్గర లీకేజీలను అరికట్టడానికి మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీని కారణంగా రెండు రోజుల పాటు భాగ్యనగరానికి తాగునీటి సరఫరా బంద్ కానుంది. ఈనెల 19వ తేదీ బుధ వారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు జులై 20వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటల వరకు మరమ్మతు పనులు జరుగుతాయి. కాబట్టి 36 గంటల పాటు జలమండలి పలు డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

**పాక్షికంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రాంతాలు**


ఎస్సార్‌నగర్ డివిజన్-6 పరిధిలోని బోరబండ, వెంకటగిరి, బంజారాహిల్స్ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలు, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్ గూడ ప్రాంతాలు, కూకట్‌పల్లి డివిజన్ 9 పరిధిలోని కేపీహెచ్‌బి, మలేషియన్ టౌన్‌షిప్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు, శేరిలింగంపల్లి డివిజన్ 15 పరిధిలోని లింగంపల్లి నుండి కొండాపూర్, గోపాల్‌నగర్, మయూరినగర్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు, నిజాంపేట్ డివిజన్ 23 పరిధిలోని ప్రగతినగర్‌లోని కొన్ని ప్రాంతాలు, నిజాంపేట్,బాచుపల్లి ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.

**పూర్తిగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రాంతాలు**

కూకట్‌పల్లి డివిజన్ 9 పరిధిలోని ఎల్లమ్మబండ, అల్వాల్ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాలు, కుత్బుల్లాపూర్ 12 డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్, చింతల్, జీడి మెట్ల, వాణి కెమికల్స్, జగద్గిరిగుట్ట, గాజులరామారం, సూరారం, అల్వాల్ రిజర్వా యర్ పరిధి ప్రాంతాలు, మల్కాజిగిరి/అల్వాల్ 13 డివిజన్ పరిధిలోని సైనిక్‌పురి, డిఫెన్స్‌కాలనీ, అల్వాల్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు, ఉప్పల్ 14 డివిజన్ పరిధిలోని కాప్రా మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాలు, సాయిబాబానగర్, రాధిక, మహేష్‌నగర్, అవుట్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు, నాగారం/ దుమ్మాయి గూడ 19 డివిజన్ పరిధిలోని నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి, కీసర, ఆర్జీకే ప్రాంతాలు, కొంపల్లి 25 డివిజన్ పరిధిలోని కొంపల్లి, గౌండ్లపోచంపల్లి, తూం కుంట, జవహర్‌నగర్, దేవరయాంజల్, హకీంపేట్ ప్రాంతాలతోపాటు ప్రజ్ఞాపూర్, ఆలేరు, ఘన్‌పూర్, కంటోన్మెంట్‌లోని కొన్ని ప్రాంతాలు, ఎంఈఎస్, తుర్కపల్లి, బయోటెక్ పార్కు ప్రాంతాల్లో నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయనున్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

## మావురాల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఇటల పూజలు

మెట్టుగూడ, జులై 17 ప్రభాతవార్త: మెట్టుగూడ డివిజన్ పరిధిలోని చిలుకలగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో ఉన్న శ్రీశ్రీశ్రీ మావురాల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నిర్వ హించిన బోనాల ఉత్సవాలకు హుజురాబాద్ ఎమ్మెల్యే ఇటల రాజేందర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో మహిమ కల్గిన అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు కమిటీ చైర్మన్ కేశబోయిన బాబురావు, శోభ, ఆలయకమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు యూ.మల్లేష్, బిజేపీ జిల్లా అధికార ప్రతినిధి శారదామల్లేష్, కేశబోయిన ఆదర్శ్‌కుమార్, మురళి, విజయ్, సింహాచలం బాబు, విశ్వహిందు పరిషత్ ప్రాంతం సహకార దర్శి రాజేశ్వర్ రెడ్డి, తెలంగాణ బజరంగ దళ్ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, శ్రీకాంత్, బీజేపీ నాయకులు బండపల్లి సతీష్ గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, మేకల సారంగపాణి, కనకట్ల హరి, ప్రభుగుప్తా, నాగేశ్వర్ రెడ్డి, అంబాల రాజేశ్వర్, నీలం శ్రీనివాస్ ముదిరాజ్‌తో పాల్గొన్నారు.



మావురాల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఇటల రాజేందర్



పాతబస్తీలో అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పాతబస్తీ నాయకులు

## 3రోజుల పాటు 'జాగృతి తీజ్-రక్షా బంధన్ మేళా'

సైఫాబాద్, జులై 17 ప్రభాతవార్త: మహిళా జాగృతి సంస్థ ఆధ్వర్యంలో అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకగా నిలిచే రక్షబంధన్, వివాహిత రాజస్తానీ మహిళలు ఎక్కువగా జరుపుకునే జాగృతి తీజ్ పండగ మేళాను ఈ నెల 28,29,30 తేదీలలో హైదర్‌గూడలోని ఇపి గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షురాలు సంగీత భూతాడ, కార్యదర్శి మీనా కస్లీవాల్ ఈ మేళాకు సంబంధించిన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మేళాలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. నిరుపేద మహిళలు ఒక వైపు కుటుంబ భారాన్ని మోస్తూ, మరొక వైపు ఖాళీ సమయంలో తయారు చేసిన చేతి వృత్తుల జైపూర్ అభరణాలు, మృదువైన బొమ్మలు, షోపీస్‌లు, గృహోపకరణలు, రంగు, రంగుల రాఖీలు తదితర కళాకృతుల వస్తువులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని వారు తెలిపారు.

## స్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి

**తెలంగాణ బెవరేజెస్ ఛైర్మన్ గజ్జెల నాగేష్**



ఇందిరమ్మ నగర్ బీరప్ప దేవాలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ బేవరేజెస్ ఛైర్మన్ గజ్జెల నాగేష్

బేగంపేట జులై 17,ప్రభాతవార్త : ప్రజలందరికీ స్వామి అనుగ్రహం ఉండాలని తెలంగాణా రాష్ట్ర బెవరేజెస్ ఛైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు.సోమవారం అమావాస్య సందర్భంగా వార్డు 2 ఇందిరమ్మ నగర్ లోని బీరప్ప దేవాలయంలో గజ్జెల నాగేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అమావాస్యని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం భక్తులతో కల్సి ఆయన పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా దేవాలయం వద్ద అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇక మీదట కూడా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేసారు.ఈ కార్యక్రమంలో బీరప్ప దేవాలయ కమిటీ సభ్యులు,బీఆర్ఎస్ నాయకులు, భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు.

## అమ్మవారికి ఘనంగా పూజలు



పద్మావతి డి.పి.రెడ్డిని సత్కరిస్తున్న ఆలయం ప్రతినిధి

హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త: బోనాలు ఉత్సవాల్లో భాగంగా జైస్వాల్ గార్డెన్‌లో మైసమ్మ అమ్మవారి దేవాలయంలో మాజీ కార్పోరేటర్ కె.పద్మావతి డి.పి.రెడ్డి సోమవారం సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అలయం అర్చకులు ఆమెను శాలువతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, ఆలయ కమిటి ప్రతినిధులు సి.యాదవరెడ్డి, బి.మధుసూధనచారి, పి.వెంకటేశ్‌గౌడ్, బి.వినోద్‌కుమార్, బి.విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల వేడుకల్లో పూజలు చేసిన శ్రీగణేష్



6వ వార్డు తాడ్ బంద్ ఆలయంలో పూజలు చేస్తున్న బిఆర్ఎస్ నేత శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట, జులై 17 ప్రభాతవార్త: ఆషాడమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని అదివారం రాత్రి కంటోన్మెంట్ 6వ వార్డు తాడ్‌బంద్,పికెట్, గాంధీ నగర్,మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన పలహారం బండి,తొట్టెల ఊరేగింపు వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఉమ్మడి ఆంధ్రపాలనలో బీసీల సంక్షేమాన్ని విస్మరించింది కాంగ్రెస్ పార్టీయే

**ఎంబిసి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ**

చిక్కడపల్లి, జులై17 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రపాలనలో బీసీల సంక్షేమాన్ని ఆ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఎంబిసి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ విమర్శించారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు నిరాధారణకు గురైన చితికిపోయిన కులవృత్తులను, ఆర్థికంగా ఆదుకోవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాల హయాంలో బీసీల బడ్జెట్ రూ.2కోట్ల నుంచి రూ.4వేల కోట్లు దాటలేదీ, ప్రభుత్వాల పనితీరువల్ల కులవృత్తులకు సరైన ఆధరణలేక పనుల్లేక జీవనం కష్టకాలంగా సాగిందన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంలో సిఎం కెసిఆర్ ఈ వర్గాలకు పూర్వవైభవం తీసుకువచ్చిందని, దేశచరిత్రలో ఎక్కడాలేని విధంగా సంక్షేమపథకాలను అమలు చేస్తోందని, బడుగులకు బాసటగా కెసిఆర్‌తోనే సాధ్యమైందని అన్నారు.



పలహారపు బండ్ల ఊరేగింపులో పాల్గొన్న గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్‌బిలాల్,ఈకార్యక్రమంలో జాంబాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## ముదిరాజ్ కులస్తులను బిసి ఎ జాబితాలో చేర్చేందుకు ఆర్డినెన్స్ విడుదల చేయాలి



సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పుట్టి యాదగిరి ముదిరాజ్

హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త: సంవత్సరాలు తరబడి ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో తమ సత్తా చూపించవలసి వస్తుందని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముదిరాజ్ కులస్తులను బిసి డి జాబితా నుంచి ఎ జాబితాలోకి మార్చాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు. సంఘం ఆధ్వర్యంలో అంబర్‌పేటలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో 16 శాతం ఉన్న ముదిరాజ్ కులస్తులను అన్ని రాజకీయ పార్టీలు దశాబ్దాలు తరబడి ఓటు బ్యాంకుగా వాడుకుని ఎన్నికల అనంతరం కరివేపాకును తీసిపారేసిన విధంగా తీసివేస్తున్నాయని ఆరోపించారు. ముదిరాజ్ కులస్తులను పార్టీలు, ప్రభుత్వాలు పార్టీల జెండాలు మోయడానికే వాడుకుంటున్నాయని, ఏలాంటి పదవుల్లో నియమించడం లేదని, అభివృద్ధి, సంక్షేమం గురించి పట్టిచుకోవడం లేదని ఆయన నిశితంగా విమర్శించారు. ఇప్పటికైనా ముదిరాజ్‌ల డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం సలహాదారు తూర్పు రామ్‌చందర్‌ముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల నవీన్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు ఎం.సతీష్‌ముదిరాజ్, డొప్ప అంజయ్యముదిరాజ్, దానవేణి శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆచరణాత్మక ప్రదర్శనతో నమ్మకాలను మార్చడం'పై 23న శిక్షణ

సైఫాబాద్, జులై 17 ప్రభాతవార్త: ఒక వ్యక్తి ఒక అంశాన్ని నమ్ముకున్నట్లైయిత్ అతని జీవనంలో నమ్ముకున్న విధంగా మారగలరని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి రాంచందర్ తెలిపారు. సైకాలజిస్టుల నైపుణ్యాభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్న ఏకైక సంస్థ తమ అసోసియేషన్ అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నాడిక్కడ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యల నివారణలో కౌన్సిలింగ్ పాత్ర ఎంతో కీలకమైనదని ఇది ఒక ఆయుధంగా పనిచేస్తుందని మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. సంఘం సభ్యులు నైపుణ్యాల పెంపుదలకు గాను సిసిఇ పేరున కౌన్సిలింగ్ నిరంతరంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల జులై, ఆగస్టు నెలల్లో ప్రతి ఆదివారం సైకాలజిస్ట్‌లకు దృశ్య మాధ్యమం ద్వారా ఉచితంగా శిక్షణలు ఇస్తున్నామని తెలిపారు. ఆదే విధంగా ఈ నెల 23న సికిం ద్రాబాద్‌లో 'ఆచరణాత్మక ప్రదర్శనతో నమ్మకాలను మార్చడం' అనే విషయంపై శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. వివరాలకు 9533660938లో సంప్రదించాలని కోరారు. ప్రతి వ్యక్తికి అనుభవాలు, ఆలోచనలతో పరిస్థితులు ప్రభావాలతో నమ్మకం మారుతుందని, నమ్మకాలు మారడం జీవితాన్ని సమయానుకూలంగా నమ్మకాలను మార్చుకోవడం ద్వారా జీవితాలు సుఖమయం అవుతాయని వివరించారు. ఈ శిక్షణను ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ డా.శిల్ప నిర్వహిస్తారని తెలిపారు

## అమ్మవారిని వేడుకుంటే కోర్కెలు నెరవేరుతాయి

**మంత్రి తలసాని**



మారేడ్‌పల్లి మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,జులై 17 ప్రభాతవార్త: మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ మైసమ్మ అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆలయ నిర్వాహకులు, బిఆర్ఎస్ నేత టీ.క్రిష్ణ యాదవ్ (కిట్టు యాదవ్), తిరుమల్ వంశీల ఆధ్వర్యంలో నిర్వహించిచన అషాడమాసం బోనాలు, పలహార బండి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి మారేడ్‌పల్లి మైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన పలహార బండి ఊరేగింపులో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలహార బండి ఊరేగింపు వేడుకల్లో మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మన్నెక్రిషాంక్, బేవరేజెస్ కార్పోరేషన్ ఛైర్మన్ గజ్జెల నాగేశ్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు మర్రి రాజశేఖర్ రెడ్డి, తలసాని సాయికిరణ్ యాదవ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్‌లతో పాటు వివిధ పార్టీల నాయకులు సన్నీ యాదవ్, గడ్డం శ్రావన్ యాదవ్, సాయిప్రసాద్, బద్రినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలంటేనే జనజాతర, సామాజిక పండుగ


**తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా**



నాట్యగురువులను సత్కరిస్తున్న దామోదరగుప్తా, దైవజ్ఞశర్మ, రమణారావు, లలితారావు, దివ్యవాణి తదితర అతిథులు

రవీంద్రభారతి, జులై 17 ప్రభాతవార్త : తెలంగాణ బోనాల జాతర పేరుమీద భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్ అధినేతలు లయన్ కె.వి.రమణారావు, లయన్ లలితారావులు తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాలను అంగరంగ వైభవంగా కళాకారుల ఆట పాట పోతరాజుల విన్యాసాలతో రవీంద్రభారతిని హోరెత్తిస్తూ జాతర ఘనంగా నిర్వహించడం హర్షదాయకమన్న ముఖ్యఅతిథి తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదరగుప్తా బోనాలంటేనే ఒక జనజాతర, ప్రజలంతా ఇంటిబయటకు వచ్చి మూకుమ్మడిగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచి జరుపుకొనే సామాజిక పండుగని, దేశంలో కేవలం తెలంగాణకే పరిమితమైన ఈ పండుగను ప్రజారోగ్యం కోరుతూ ప్రభుత్వపరంగా నిర్వహించుకోవడం ప్రత్యేకతని, నేటి అధునాతన సాంకేతికయుగంలో పిల్లలను కళలవైపు ప్రోత్సహిస్తూ కాపాడుతున్న తల్లిదండ్రులను, నాట్యాచార్యులను అభినందనీయులని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి దామోదరగుప్త విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, నగర డీసిపి రామదాసు తేజావత్, సినీనటి దివ్యవాణి, రమణారావు, లలితారావు, మారుతి వరుణ్, ఎం.వసుధ తదితరులతో కలిసి నేటి తెలంగాణ బోనాల జాతర ప్రదర్శనల్లో పాల్గొన కళాకారుల ప్రముఖ నాట్యగురువులు సంపత్; శ్రీశైలం; పద్మజాశర్మ; విష్ణుప్రియ; కృష్ణవేణి, సింధు; మౌనిక, సంధ్యారాణి తదితరులతోపాటు కళాకారులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుండి రాత్రి వరకు జరిగిన ప్రదర్శనలు హాజరైన అశేష ప్రేక్షకులను ఉర్రూతలూగించి మంత్రముగ్ధులను చేశాయి.

## ఘనంగా పలహార బండి ఊరేగింపు



బోనాల ఉత్సవాల్లో తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న వైఎస్ఆర్ సిపి మాజీ మార్కెట్ యాడ్ ఛైర్మన్ తాడిపత్రి బోగతి నారాయణ రెడ్డి

యూసుఫ్‌గూడ, జులై 17, ప్రభాతవార్త : వివేకానంద నగర్‌లోని శ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయంలో బోనాలు పలహార బండి ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. డివిజన్ బిఆర్ఎస్ యువజన అధ్యక్షులు దేవిరింటి మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ఈవేడుకల్లో వైఎస్ఆర్ సిపి మాజీ మార్కెట్ యాడ్ ఛైర్మన్ తాడిపత్రి బోగతి నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కాయితీ యాదవరెడ్డి, శ్రీనువాస్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**గాయత్రినగర్‌లో..** గాయత్రి నగర్ గణేష్ ఉత్సవ కమిటి, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలోని బంగారు మైసమ్మ అమ్మవారికి బోనం, తొట్టెల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

## రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి

**హైకోర్టు న్యాయవాది షేక్ జిలాని**

హైదరాబాద్,జులై 17,ప్రభాతవార్త: ప్రభుత్వం వీలైనంత తొందరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని హైకోర్టు అడ్వకేట్ షేక్ జిలానీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనీఫా బీ వారసులు రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ మండలం, మన్సూరాబాద్‌లో పలు సర్వేనెంబర్లలో సుమారు పదివేల ఎకరాల భూమిని 50వేలమందికి వందగజాల చొప్పున పంపిణీ చేశారని కానీ ఆభూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగలేదన్నారు. దీంతో న్యాయం కోసం వేలాదిమంది కోర్టుల్లో పిటిషన్లు వేశామని కోర్టుసైతం ఆయా భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించిన సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో అడ్వకేట్ సునీల్‌బాబు పాల్గొన్నారు.

### బిసిలను సిఎం మరోసారి మోసం చేయడమే

సైఫాబాద్, జులై 17 ప్రభాతవార్త: చేతి వృత్తిదారులు, కుల వృత్తిదారులైన బిసిలకు లక్ష రూపాయలు ఇస్తామని సిఎం కెసిఆర్ ప్రకటించడం అంటే బిసిలను మరొకసారి మోసం చేయడమేనని బిజెపి ఓబిసి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆరోపించారు. రాష్ట్రంలో 5.5 లక్షల మంది బిసిలు లక్ష రూపాయల కోసం దరఖాస్తు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 400 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు.

## మంత్రి చేతులమీదుగా అశోక్‌తేజకు డా. సినారె సాహిత్య పురస్కారం

నాంపల్లి, జులై 17 ప్రభాతవార్త : తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రముఖ సినీగీత రచయిత, జాతీయ పురస్కార గ్రహీత డా. సుద్దాల అశోక్‌తేజకు 2023 సంవత్సరానికిగాను జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి.నారాయణరెడ్డి సాహిత్య పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతులమీదుగా ఘనంగా సత్కరించి ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య తెలిపారు. ఈ నెల 27 గురువారం ఉదయం 10.30గంటలకు పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగే డా. సి.నారాయణరెడ్డి 92వ జయంతి ఉత్సవంలో పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగే డా. సి.నారాయణరెడ్డి 92వ జయంతి ఉత్సవానికి ముఖ్యఅతిథిగా మంత్రి తన్నీరు హరీష్‌రావు విచ్చేసి విశిష్ట అతిథులు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఛైర్మన్ డా. కె.వి.రమణాచారి, డా. జె.చెన్నయ్య తదితర ప్రముఖులతో కలిసి డా. సుద్దాల అశోక్‌తేజను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి డా. సి.నారాయణరెడ్డి సాహిత్య పురస్కారం, పురస్కారం కింద 25వేల రూపాయల నగదు బహుమతిని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ముద్రించిన పదిమంది కవయిత్రులు, రచయిత్రుల గ్రంథాలను అతిథుల చేతులమీదుగా ఆవిష్కరింపజేయనున్నట్లు చెన్నయ్య విశదీకరించారు. అధికసంఖ్యలో డా. సినారె, డా. అశోక్‌తేజ అభిమానులు, సాహితీప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మార్ట్‌లో సిబ్బందిని ఇబ్బంది పెట్టిన వారిపై కేసు నమోదు

బేగంపేట జులై 17,ప్రభాతవార్త : బేగంపేట ప్రధాన రోడ్డులో ఉన్న ఏ అండ్ టీ వైన్ మార్ట్‌లోకి గుర్తు తెలియని ఇరువురు వ్యక్తులు కౌంటర్ లోకి అక్రమంగా ప్రవేశించి సిబ్బందిని ఇబ్బంది పెట్టిన ఘటనపై బేగంపేట పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదైంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట ప్రధాన రోడ్డు ప్రకాష్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద బేగంపేట మయూరి మార్గ్‌కు చెందిన తార్కంపేట శ్రీనివాస్ ఏ అండ్ టి వైన్ షాప్ నిర్వహిస్తున్నారు.ఈ నెల 16వతేదీన సుమారు గం 10.50నిల సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వైన్‌షాప్‌కు వచ్చి కౌంటర్ లోకి బలవంతంగా ప్రవేశించి తమ సిబ్బందితో చేతులతో పందెం కాసి వస్తువులను పాడుచేసి ఇబ్బంది పెట్టారని శ్రీనివాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటన అంతా సీసీటీవీ కెమెరాలలో రికార్డు అయిందన్నారు.వచ్చిన ఇద్దరు వ్యక్తులు టీఎస్ 09 ఈ జడ్ 4716 ద్విచక్రవాహనంపైన పారిపోయారన్నారు. దుకాణంలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు సిబ్బందిని ఇబ్బంది పెట్టి వస్తువులను పాడు చేసిన వారిని గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.జయచందర్ తెలియజేసారు.

## ఆరోగ్యమిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపడుతాం**



ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మిత్రల రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య

చిక్కడపల్లి, జులై 17 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మిత్రల రాష్ట్ర స్థాయి సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్రులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, రాష్ట్రంలో సుమారు 800 మంది 16 సంవత్సరాలుగా పనిచేస్తుంటే వేతనం మాత్రం రూ.15,600 మాత్రమే ఇవ్వడం దారుణం అని అన్నారు. జీవో నెంబరు 60 ప్రకారం వీరికి డేటాఎంట్రి ఆఫీసర్ గా బాధ్యతలను ఇవ్వకుండా నాల్గవ తరగతి అన్‌స్కిల్డ్ వేతనం ఇవ్వడం అన్యాయం అని అన్నారు. ఆరోగ్య మిత్రాలు డిమాండ్ చేస్తున్నట్లుగా రూ.28వేలకు పూర్తిగా అర్హులని, వెంటనే వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య ట్రస్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, అవసరమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, వీరికి సిఐటియు అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఎం.కుమార్, ఉపాధ్యక్షుడు పి.విష్ణు, సంఘం నేతలు నరేశ్‌కుమార్, మహేందర్, చిరుమప్ప, గోవిందరెడ్డి, స్వామి, అనూజ, స్వప్న, సుమ పాల్గొన్నారు.

## ప్రతిభా రత్న అవార్డును అందుకున్న రత్నమాల




త్యాగరాయ గానసభలో ప్రతిభా రత్న అవార్డును కోదండరాం చేతుల మీదుగా అందుకుంటున్న ప్రముఖ సీరియల్ నటి రత్నమాల

నార్సింగి, జులై 17 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సీరియల్ నటి రత్నమాల తెలంగాణ జన సమితీ అధ్యక్షులు కొదండరాం చేతుల మీదుగా "ప్రతిభా రత్న" అవార్డును అందుకున్నారు. ఈటీవి, జీతెలుగు ప్రసార సాధనాల్లో వస్తున్న అనేక టీవీ సీరియళ్లలో ఉత్తమ నటనను కనబర్చిన రత్నమాలకు వల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు ఈ అవార్డును ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వేదికపై ఇతర నటీ, నటులతో కలిసి ఆమె ఈ అవార్డును అందుకొన్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కోదండరాం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ఏదో ఒకరకమైన ప్రతిభ ఉంటుందని, దాన్ని గుర్తించి సానబెడితే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ఎంచుకున్న రంగంలో శిఖరాగ్రానికి చేరుకునేందుకు కష్టపడి పని చేసే వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు, అవార్డులు అన్నీ నడుచుకుంటూ వస్తాయన్నారు. ఇతరుల మనస్సులను రంజింప చేసేలా, ఆకట్టుకునేలా నటించడం చాలా కష్టమైన పని అన్నారు. నటనలో నవరసాలను పలికించే సామర్థ్యంను కలిగిన వారే సినిమా, సీరియళ్ల ప్రపంచంలో రాణిస్తారని తెలిపారు. అన్ని రంగాలలో మంచీ, చెడు ఉంటాయని, హంస వలే మంచిని మాత్రమే తీసుకొని చెడును వదిలేసుకుంటూ ముందుకు సాగిపోయే వారికి సక్సెస్ లభిస్తుందన్నారు. ఈ అవార్డు రావడం పట్ల రత్నమాల స్పందిస్తూ చాలా సంతోషంగా ఉందన్నారు. వెన్నుతట్టి ప్రోత్సహించే వారు, అభినందించే వారుంటే నటనలో మేము పడే కష్టాలన్నింటిని మరిచిపోయి మరింత ఉత్సాహంగా నటిస్తామన్నారు. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందని, మంచి మంచి పాత్రలను ఎంపిక చేసుకొని ప్రేక్షక దేవుళ్లను మెప్పించేందుకు మరింత కష్టపడి నటిస్తానని రత్నమాల తెలిపారు. రత్నమాలకు అవార్డు వచ్చిన విషయం తెలుసుకొన్న ఆమె అభిమానులు, స్థానికులు ఆమె ఇంటికి వెళ్లి, ఫోన్‌లలో అభినందనలు తెలుపుతున్నారు.

## నేటి నుంచి హుస్సేన్‌సాగర్‌లో మాన్‌సూన్ రెగట్టా పోటీలు



పోటీలకు సిద్ధమైన బాల బాలికలు

హైదరాబాద్, జులై 17,ప్రభాతవార్త: నగరవాసులుఅత్యంత ఆసక్తిగా ఎదురుచూసే మాన్‌సూన్ రెగట్టా పోటీలకు హుస్సేన్ సాగర్ సిద్ధమైంది. ఈమేరకు మంగళవారం పోటీలు ప్రారంభం కానున్నాయి.మాన్‌సూన్‌రెగట్టా రోలింగ్ ట్రోఫి ,ప్రతిష్టాత్మకమైన ఎస్‌హెచ్ బాబు మెమోరియాల్ ట్రోఫీలు ఉత్తమ నావికులను గుర్తించి పథకాలు అందజేయనున్నారు. ఈపోటీల్లో తొలిసారిగా బాలబాలికలకు అండర్ 19విభాగంలో 420మిక్స్‌డ్ క్లాస్‌ను పరిచయం చేయనున్నారు. మలేషియాకు చెందిన లియోనార్డ్ చిన్ అధ్యక్షతన ఇజ్రాయెల్‌కు చెందిన రాన్‌యాఫే ,ఇండియాకు చెందిన కల్నల్ కన్వర్‌తో కూడిన అంతర్జాతీయ జ్యూరీ బృందం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. సబ్‌జూనియర్స్‌లో జరిగే టీమ్ రేసింగ్ ఈవెంట్‌కు భారత కెప్టెన్ అభిమన్యు పాటంకర్ ఛీఫ్ ఆంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే భోపాల్, మైసూర్, గోవా, చెన్నై నుంచి ఎంట్రీలు రాగా హైదరాబాద్‌కు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారు.



తెలంగాణ ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం పలు దేవాలయాల్లో అంగ రంగ వైభవంగా పలహారపు పండ్ల ఊరేగింపును నిర్వహించారు. గౌలిగూడ వద్ద తెలంగాణ బజరంగ్ సేనా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేధిక నుంచి పలహారపు బండ్ల ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఈకార్య క్రమంలో బజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త,సూర్యశుక్లా తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణ రావాలని ప్రత్యేక పూజలు

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**



కట్టమైసమ్మ ను దర్శించుకున్న టీడీపీ నేతలు

ధర్నాచౌక్, జులై 17, ప్రభాతవార్త: తెలంగాణ ప్రజలు కోరుకున్న నిజమైన సామా జిక తెలంగాణ రావాలని కట్టమై సమ్మకు ప్రత్యే క పూజలు నిర్వహించామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా తెలిపారు. సోమవారం ఆయన టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కమిటీ నాయకులతో కలసి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చీకటి పాలన పోవాలని, నీళ్ల, నిధులు మరియు శాంతి, సహనంతో కూడిన తెలంగాణ వచ్చి, ప్రజలంతా సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని కోరుకు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, చంద్రమోహన్‌గౌడ్, సత్యనారాయణ, వై.ఎల్. నరసింహగౌడ్, ఎల్.రవిగౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

## మలక్‌పేటలో ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



మలక్‌పేట, జులై 17 ప్రభాతవార్త : మలక్‌పేటలో అమ్మవారి ఘ టాల ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి ఓల్డ్ మలక్‌పేట శ్రీ పోచమ్మ దేవాలయంలో బోనాల పం డుగ పురస్కరిం చుకుని అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సబ్యులు పిటి.శంకర్‌ముదిరాజ్, కొమురెల్లి రాజశేఖర్‌రెడ్డి, తులసి సురేష్‌కుమార్, ముప్పిడి శ్రీనివాసులు ప్రారంభించారు. దేవాలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఘటాల ఊరేగింపు పంచశీల గ్రంథాలయం మీదుగా వివిధ కాలనీల మీదుగా మహంకాళి దేవాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా భవిష్యవాణి కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో చౌకీ రవికుమార్, నరేందర్ ముదిరాజ్, చౌకిరాజు, శివరాజ్, పుల్కం శ్రీనివాస, వెంకటేష్, తిన్నోసింగ్,ఘటం బాబా పాల్గొన్నారు.

## శ్రీశైలంలో పూజలు చేసిన ఎమ్మెల్యే


ఆలయ ఆవరణలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, జులై 17, ప్రభాతవార్త: కూకట్‌పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలో కలిసి సోమవారం శ్రీశైలంలోని శ్రీ మల్లికార్జున భ్రమరాంబికా దేవి స్వామివార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు కార్పోరేటర్లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్‌గౌడ్, టిఆర్ఎస్ పార్టీ నేతలు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న హారీష్‌రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, జులై 17, ప్రభాతవార్త : ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రధాని తొమ్మిది ఏళ్ళు విజయవంతమైన సుపరిపాలన సందర్భంగా సోమవారం బాలానగర్ డివిజన్‌లోని రాజుకాలనీ మహిళా భవన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హారీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నవారికి కావలసిన ఉచిత మందులు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌ని భారతీయ జనతా పార్టీ తరపున హారీష్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు జి.రమేష్, నాయకులు కొత్తూరి రమేష్, లక్ష్మణ్, శివరంజని, డివిజన్ నాయకులు, సీనియర్ నాయకులు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి


150వ డివిజన్ మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, మన్నెక్రిషాంక్, జె.ఎం. ఆర్.తదితరులు


కంటోన్మెంట్, జులై 17 ప్రభాతవార్త: మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజిస్తే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని మల్కాజిగిరి కంటోన్మెంట్‌ల బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని మారేడ్‌పల్లి మైసమ్మ దేవాలయం నిర్వాహకులు కిట్టు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలు,పలహార బండి ఊరేగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నెక్రిషాంక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, నాయకులు గద్దంశ్రావణ్, సన్నీ యాదవ్, తిరుమల్, సురవి శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలి


జిటియస్ శ్రీరామాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయంలో రాహు,కేతు హోమం పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ చిన్నరమేష్

యూసుఫ్‌గూడ, జులై 17, ప్రభాతవార్త : ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ జిటియస్ శ్రీరామాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయంలో అమావాస్యను పురస్కరించుకుని రాహు,కేతు హోమం పూజలను నిర్వహించారు. అదేవిధంగా కాలసర్పదోష నివారాణార్థం జరిగిన హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిన్నరమేష్, కమిటి సభ్యులు సిహెచ్ శ్రీనువాస్, జి.లక్ష్మి, ఆలయ ప్రధాన అర్చకులు దేవేందర్ శర్మ, లక్ష్మీనారాయణ మూర్తి, అర్చకులు ఫనిందర్ శర్మ, మహేష్ శాస్త్రి, నర్సింహ మూర్తి పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన కట్టమైసమ్మ ఆషాఢం జాతర


గంగా తెప్పోత్సవ ఊరేగింపు

ధర్నాచౌక్, జులై 17, ప్రభాతవార్త: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఆషాఢం జాతర (బోనాల పండుగ) వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఆదివారం ప్రారంభం అయిన బోనాల వేడుకలలో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారి పంచామృతాభిషేకంతో ప్రారంభమయి, మధ్యాహ్నం ఘటోత్సవం, గంగాతెప్పోత్సవ ఊరేగింపు, గాము కళ్యాణం, రాత్రి దేవదాసి స్వర్ణలత ద్వారా భవిష్యవాణి వినిపించే రంగం, అనంతరం పోతరాజుల విన్యాసము వంటి కార్యక్రమాలతో బోనాల వేడుకలు ముగిశాయి. రెండవ రోజు సైతం అనేక మంది భక్తులు ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాలలో దేవాలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు గోల్కొండ గౌతం కుమార్ పటేల్, కార్యనిర్వహణాధికారి సాంబశివరావు, ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మ, రాజేష్‌శర్మ పాల్గొన్నారు.

# గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కస్టడీ మరణంపై న్యాయవిచారణ

**గొడవ కేసులో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన వ్యక్తి మృతి, కేసు నమోదు - బాలానగర్ ఏసిపి ఆధ్వర్యంలో దర్యాప్తు**

గచ్చిబౌలి, జులై 17 ప్రభాతవార్త : గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకున్న కస్టడీ మరణంపై న్యాయవిచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఓ గొడవ వ్యవహారంలో శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కుప్పకూలడం, చికిత్స నిమిత్తం సదరు వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే చికిత్స పొందుతూ మృతిచెందడం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. గుండెపోటు, అనారోగ్య కారణాలతోనే వ్యక్తి మృతిచెందినట్లు పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటుండగా, ఘటనపై కేసు నమోదు చేసి బాలానగర్ ఏసిపి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపడుతున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ ఖజారియా ప్రాంతానికి చెందిన నితీష్‌కుమార్(32) బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. ఐటి కారిడార్ పరిధిలోని నానక్‌రాంగూడలో గల సుమధుర నిర్మాణ సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తు అక్కడే ఉన్న లేబర్ క్యాంపులో నివాసం ఉంటున్నాడు. కాగా శనివారం సాయంత్రం నితీష్‌కుమార్‌తో పాటు బిట్టుకకుమార్, రాకేశ్‌లు సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలలో కొందరు కూలీలు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. రాత్రి 11 గంటల తరువాత బయటకు వెళ్లేందుకు అనుమతి లేదంటూ సెక్యూరిటీ సిబ్బంది నితీష్, బిట్టు, రాకేశ్‌లు కూలీలను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో సెక్యూరిటీ సిబ్బంది కూలీల మీద దాడి చేయడంతో ఇద్దరు కూలీలు వికాశ్, జబ్బార్‌లకు గాయాలయ్యాయి. కూలీలతో జరిగిన పెనుగులాటలో నితీష్‌కుమార్‌కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, డయల్ 100 ద్వారా పిర్యాదు అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని కూలీల మీద దాడి చేసిన సెక్యూరిటీ సిబ్బంది నితీష్‌కుమార్, బిట్టు, రాకేశ్‌లను అదుపులోకి తీసుకొని 11.30కు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. వీరి మీద దాడి కేసు నమోదు చేసి స్టేషన్‌లో ఉంచారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న నిందితుల్లో నితీష్‌కుమార్ ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో అక్కడే ఉన్న కానిస్టేబుళ్లు సిపిఆర్ నిర్వహించిన అనంతరం నితీష్‌కుమార్‌ను పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న హిమగిరి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేరిన 10 నిమిషాల్లోలనే చికిత్స తీసుకుంటూ నితీష్‌కుమార్ మృతిచెందాడు. దీంతో చిన్నపాటి గొడవతో కేసు నమోదై పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తి తెల్లవారే సరికి మృతిచెందడం తీవ్ర సంచలనంగా మారింది.

**అనారోగ్యంతోనే సెక్యూరిటీ గార్డు మృతి: పోలీసు అధికారులు**

గతంలో ఉన్న అనారోగ్య సమస్యలతో పాటు గుండెపోటు రావడంతోనే సెక్యూరిటీ గార్డు నితీష్‌కుమార్ మృతిచెందాడని మాదాపూర్ డిసిపి శిల్పావల్లి, ఏసిపి శ్రీనివాస్‌లు తెలిపారు. లేబర్ క్యాంపులో గొడవ అనంతరం శనివారం అర్థరాత్రి మరో ఇద్దరితో కలిసి నితీష్ కుమార్‌ను గచ్చిబౌలి పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారని, వారిని స్టేషన్ రిసెప్షన్ వద్దే కూర్చోబెట్టినట్లు తెలిపారు. తిరిగి క్యాంపుకు పంపిస్తే మరరోసారి కూలీలతో గొడవ జరిగే అవకాశం ఉండడంతో ఆదివారం ఉదయం వరకు సెక్యూరిటీ సిబ్బందిని స్టేషన్‌లో ఉంచారని, కానీ ఉదయం 9 గంటల ప్రాంతంలో స్టేషన్ రిసెప్షన్ వద్ద నితీష్‌కుమార్ ఒక్కసారిగా కళ్లుతిరిగి కుప్పకూలా డన్నారు. తమ కానిస్టేబుళ్లు సిపిఆర్ నిర్వహించి, ఆసుపత్రికి తరలిం చగా, చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. నితీష్‌కుమార్ మృతికి గుండెపోటు కారణమని, గతంలో సైతం ఆనారోగ్య సమస్యలు ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ ఘటనపై ఐపిసి సెక్షన్ 176/1/ఎ కింద కస్టడీ మరణంగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. బాలానగర్ ఏసిపి ఆధ్వర్యంలో పూర్తి దర్యాప్తు చేపట్టడంతో పాటు ఎన్‌హెచ్‌ఆర్‌సి నిబంధనలకు అనుగుణంగా 10వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ కొనసాగుతుందని అన్నారు. చనిపోయిన నితీష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, జులై 17 ప్రభాతవార్త : విద్యుత్ తీగలకు అడ్డుతగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా మంగళవారం(18-07-2023)రోజున బహాదూర్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11కెవి ఐడిఏ బహాదూర్‌పల్లి ఫీడర్, లక్ష్మీనగర్ ఫీడర్ల పరిధిలోని సాయినాథ్‌సొసైటీ, బహాదూర్‌పల్లి ఎక్స్‌రోడ్స్, విశ్వకర్మకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9గంల నుండి మధ్యాహ్నం 1గంల వరకు, 11కెవి కట్టమైసమ్మ ఫీడర్ పరిధిలోని భవాని నగర్‌కాలనీ, సూరారం ఎక్స్‌రోడ్స్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 5గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహాకరించాల్సిందిగా ఏఈ కోరారు.

### సిఎం కెసిఆర్ పథకాలు దేశంలో ఆదర్శం: మంత్రి తలసాని

కంటోన్మెంట్, జులై 17 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర పశుసంవర్ధక,సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్ నగర్ అసెంబ్లీకి చెందిన 33 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పేదింటి ఆడపడుచుల వివాహానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1 లక్షల 16 ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఘనత సిఎం కేసిఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కొలను లక్ష్మి బాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, ఖలీల్, సంతోష్, ఖరీమ్ తదితరులు పాల్గొన్నారు.


### అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : జంపనప్రతాప్

కంటోన్మెంట్, జులై 17 ప్రభాతవార్త: అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని సోమవారం కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అజిత్, ప్రేమ్, దుర్గయ్య, నర్సింహ్మా, రామారావు, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి

తిరుమలగిరి,జులై 17 ప్రభాతవార్త: ఆషాడమాసంలో అమ్మవారిని దర్శనం చేసుకోవడం వలన అందరు సుఖసంతోషాలతో ఉంటారని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నెక్రిషాంక్ అన్నారు. కంటోన్మెంట్ మాజీ బోర్డు సభ్యులు ప్యారసాని శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయంలో బోనాల ఉత్సవాలు జరిగాయి. ఈ బోనాల జాతరలో భాగంగా మనె న్నక్రిషాంక్ పాల్గొని నల్లపోచమ్మ అమ్మవారికి పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాడమాసంలో అమ్మవారిని దర్శనం చేసుకోవడం వలన అందరు సుఖసంతోషాలతో సుఖసంతోషాలతో ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ 7వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు యశ్వంత్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, ఎంపి.రాజు,మోహన్, సునీత తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో న్నదానం : శ్యామ్ కుమార్





తిరుమలగిరి,జులై 17 ప్రభాతవార్త : లాల్‌బజార్ మహంకాళి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో అమాస్యను పురస్కరించుకొని లాల్‌బజార్ మహంకాళి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం మాజీ బోర్డు సభ్యుడు శ్యామ్ కుమార్ ఆధ్వర యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ యశ్వంత్ కుమార్ ఎసహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రతి అమావాస్యకు అన్నదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరి శంకర్, మాజీ బోర్డు సభ్యురాలు భాగ్యశ్రీ, శ్యామన్న యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుడు అదృశ్యం



జీడిమెట్ల, జులై17 ప్రభాతవార్త: ఇంట్లో నుంచి బయటకు వెళ్ళినే వృద్ధుడు అదృశ్యమైన సంఘటన జగద్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జగద్గిరిగుట్ట ఎల్లమ్మబండకు చెందిన సత్తిరెడ్డి(61) అనే వృద్ధుడు ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో స్నేహితులు, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు సత్తి రెడ్డి ఇంటి నుంచి వెళ్ళిన సమయంలో ఆరెంజ్ కలర్ టీ-షర్ట్, బ్లాక్‌షార్ట్ ధరించాడని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్‌ను శాలువ కప్పి సన్మానించిన దృశ్యం. ఈ కార్యక్రమంలో గోల్కొండ బిజెపి జిల్లా అధ్యక్షులు వి.పాండుయాదవ్,బిజెపి నాయకులు కట్టప్ప తదితరులు



## వైభవంగా బంగారు మైసమ్మ అమ్మవారి ఘటం ఊరేగింపు

చార్మినార్,జులై 17 ప్రబాతవార్త : ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్బంగా సోమవారం శాలిబండ బేలా శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం అమ్మవారి ఘటం ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్ద ఎత్తున అమ మ్మవారి ఘటానికి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మందిరం కమిటి ప్రధాన కార్యదర్శి మధుసూతన్ యాదవ్,కోశాధికారి హంసరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.కాగా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

### జగదాంబ మందిరంలో వైభవంగా బోనాలు


బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొన్న సుల్తాన్ షాహి శ్రీ జగదాంబ మందిరం కమిటి ప్రధాన కార్యదర్శి రాకేష్ తివారీ

యాకుత్‌పుర,జులై 17 ప్రభాతవార్త : పాతబస్తీ సుల్తాన్‌షాహిలోని శ్రీ జగదాంబ మందిరంలో ఆషాడ మాసం బోనాలు జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి.పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారికి అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు.ఈ సందర్బంగా మందిరం కమిటి ప్రధాన కార్యదర్శి రాకేష్ తివారీ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మందిరంలో ఘనంగా బోనాల జాతర ఉత్సవాలను జరుపుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటి ప్రతినిధులు సుదర్శన్,శశాంక్ తివారీలు పాల్గొన్నారు.

## నాచారం ఓల్డ్ విలేజ్‌లో ఘనంగా అమ్మవారి బోనాల ఉత్సవాలు


బోనాలను సమర్పించేందుకు వెళ్లుతున్న ఇందిరమ్మ మహిళలు

నాచారం. జులై 17 ప్రభాతవార్త: నాచారంలోని ఓల్డ్ విలేజ్‌లో బోనాల ఉత్సవాలు రెండో రోజు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిలకలగూడ పద్మమ్మ, కొన్నె ఇందిరమ్మ ఆద్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఓల్ విలేజ్ నుంచి అమ్మవారి దేవాలయం వరకు బొనంతో నృత్యాలు చేస్తూ శివసత్తులతో కలసి బోనాల ఊరేగింపు తీశారు. ఈ సందర్భంగా కొన్నె ఇందిరమ్మ మాట్లాడుతూ గత 20ఏండ్లుగా బోనాల వేడుకలను ఎంతో వైభవంగా జరుపుతున్నామన్నారు. ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాని సకాలంలో వర్షాలు పడాలని అమ్మవారిని వేడుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రేణుక, వెంకటమ్మ, శ్రీధర్, గాయత్రి, బ్రహ్మం, సంగీత, విజయ, ఉప్పమ్మ, వెంకటేష్, రాజ్‌కుమార్, మహేష్, నరేష్, సతీష్ తధితరులు పాల్గొన్నారు.


మంత్రి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరిమారయ్య. చిత్రంలో కుత్బుల్లాపూర్ యువజన విభాగం అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్‌యాదవ్, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్

## అమావాస్య రోజు భవన నిర్మాణ కార్మికులు పనులు బంద్ చేయాలి



హెచ్‌ఎఫ్ నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల కార్యాలయం వద్ద గుర్తింపు కార్డులను అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షులు మహ్మాద్ అహ్మద్

యూసుఫ్‌గూడ, జులై 17, ప్రభాతవార్త : అమావాస్య రోజున విధిగా భవన నిర్మాణ కార్మికులు పనులు బంద్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాష్ట్ర కమిటి ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మాద్ అహ్మాద్ అన్నారు. సోమవారం అమావాస్య సందర్భంగా రహ్మత్‌నగర్ హెచ్‌ఎఫ్ నగర్‌లోని కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో దాదాపు 12వేల మంది వరకు భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని వారందరికి ఈఎస్‌ఐ సౌకర్యం, లోన్స్, ఫించన్లు అందేలా చూడాలన్నారు. అదేవిధంగా పనులు నిర్వర్తించే సమయంలో ప్రమాదవశాత్తు చనిపోతే లేబర్ డిపార్టుమెంటు నుంచి ఎఫ్‌ఐఆర్ అయిన తర్వాత 15లక్షల వరకు వారికి అందజేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిని పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈవిషయాలపై ఇప్పటికే కార్మిక శాఖ మంత్రిని కూడా కలవనున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బంగారి, విఠల్, ఫారుక్, రాజుగౌడ్, కొలన్ క్రిష్ణ, బాలు, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంటీ సంస్థ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


హెచ్‌ఎంటీ సంస్థ చైర్మన్ పంకజ్‌గుప్తతో ఎమ్మెల్యే కెపి వివేకానంద్

జీడిమెట్ల, జులై 17 ప్రభాతవార్త: హెచ్‌ఎంటీ కార్మికుల సమస్యల పరిషారానికై సోమవారం నియోజవర్గ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ హెచ్‌ఎంటీ బెంగులూరు కార్యాలయంలో సంస్థ చైర్మన్ పంకజ్‌గుప్తతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్‌ఎంటీ సంస్థ కార్మికుల అధ్యక్షుడిగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంస్థ చైర్మన్‌కు వివరించారు. స్వాతంత్ర్యం పొందిన తరువాత స్థాపించిన హెచ్‌ఎంటీ సంస్థ ప్రభుత్వ రంగంలో ఎంతో విశిష్టమైనదని, ఈ సంస్థ దేశ అభివృద్ధికి ఎంతో సేవలు అందించిందని, కానీ నేడు ఈ సంస్థ ధీన స్థితిలో ఉందన్నారు. ఈ సంస్థను, సంస్థపై ఆధారపడిన కార్మికులను ఆదుకునే భాద్యత యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందిన చాలా మంది ఉద్యోగులు సరైన టెర్మినల్ ప్రయోజనాలను పొందకుండా మరణించారని, న్యాయస్థానాలను ఆశ్రయించిన వారికి మాత్రమే టెర్మినల్ ప్రయోజనాలను వర్తింపచేస్తోందని, ఇందలో ఒక విభాగం ఉద్యోగులకు మాత్రమే టెర్మినల్ ప్రయోజనాలను అవుట్ ఆఫ్ టర్న్ ప్రాతిపదికన చెల్లిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎస్.సి.హెచ్.ఓ అధ్యక్షుడు చంద్రశేఖర్, బెంగళూరు అధ్యక్షుడు హారీష, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.ఓ ప్రసన్న, హైద్రాబాద్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి శ్రీశైలం, న్యాయ సలహాదారుడు ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

## మాదిగ మృతవీరులకు నివాళులు

సైఫాబాద్, జులై 17 ప్రభాతవార్త: కమ్మ భూస్వామ్య కులదురంహకార రైతాంగ హంతక ముఠా చేసిన అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా కారంచెడు మాదిగల చేసిన దళిత ప్రతిఘటన పోరాటంలో అశువులు బాసిన మృతవీరుల పోరాట స్ఫూర్తిని నేటి దళిత సమాజం కొనసాగించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. సోమవారం నాడిక్కడ జరిగిన కారంచెడు మాదిగ మృతవీరుల సంస్మరణ సభలో వీరుల చిత్రపటానికి వడ్లమూరి పూల మాలలు వేసి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి బాధిత సమాజానికి న్యాయం జరగలేదని, హంతకులకు సరైన శిక్ష పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో రాజకీయ వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ కుమ్మక్కై బాధిత దళిత సమాజానికి తీరని ద్రోహం చేశాయని ఆరోపించారు. అగ్రకుల మనువాదుల పాలనలో దళిత జాతికి రక్షణ ఉండదని తెలిపోయిందని, సామాజిక న్యాయం జరగదని స్పష్టమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, దళిత బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, పార్టీ నాయకులు దేవునూరి శ్రీనివాస్, సుబ్బారావు, పెండ్యాల సుచిందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, జులై 17 ప్రభాతవార్త : మహిళల రక్షణకు, నేరాల అదుపుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్ జైపూరికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరివంశరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, నాగోలు డివిజన్ భారాస పార్టీ అధ్యక్షుడు చిరంజీవి, రామకృష్ణారెడ్డి, జంగయ్య, రవి, రమేష్, శిల్పారెడ్డి, శంకర్, వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కర్మన్‌ఘాట్ టెంపుల్‌కు వచ్చిన మురళీధర్‌రావుకు సన్మానం



సరూర్‌నగర్, జులై 17 ప్రభాతవార్త: చారిత్రక కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయాన్ని సోమవారం జాతీయ బిజెపి నాయకుడు, మధ్యప్రదేశ్ బిజెపి ఇంఛార్జి పి.మురళీధర్ రావు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆయనను మహేశ్వరం, ఎల్‌బినగర్ నియోజకవర్గాల బిజెపి నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్‌లతో పాటు జక్కిడి మధుసూదన్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగలో ఫ్లెక్సీ ఏర్పాటు వివాదం

**యువకుడిపై బీరు సీసాతో దాడి.. గాయాలు**

సరూర్‌నగర్, జులై 17 ప్రభాతవార్త: బోనాల పండుగ సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో జరిగిన వివాదం ఓ యువకునిపై దాడికి దారి తీసింది. ఓ పార్టీకి చెందిన జెండా దిమ్మె వద్ద మరొక పార్టీకి చెందిన వారి ఫ్లెక్సీ ఏర్పాటు వివాదానికి కారణమైంది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బడంగ్‌పేట్ గాంధీనగర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బడంగ్‌పేట్ గాంధీనగర్‌లో బోనాల సందర్భంగా బిజెపి జెండా ఉన్న దిమ్మెకు బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారు బోనాల పండుగ శుభాకాంక్షల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక యువకుడు సిరిమల్లయ్య సుధీర్ (24) ఫ్లెక్సీని తొలగించాడు. ఈ నేపథ్యంలో స్పందించిన మల్లేష్ అనే నాయకుడు మాట్లాడదామని సుధీర్‌ను తన ఇంటికి ఆదివారం రాత్రి పిలిపించారు. అయితే ఫ్లెక్సీ విషయమై మాట్లాడుతుండగానే చెలరేగిన వివాదంలో ఒక్కసారిగా ఒంటెపాక శ్రీరాం అనే వ్యక్తి బీరు సీసాతో సుధీర్ తలపై బాది గాయపరిచాడు.బాధిదుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### శివసాయినగర్‌లో ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకాలు



సరూర్‌నగర్, జులై 17 ప్రభాతవార్త: మీర్‌పేట్ శివసాయినగర్‌లోని శ్రీ గౌరి నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. సనాతన ప్రవక్త సమితి, శ్రీ గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సంతోష్ రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకట రమణ, ప్రధాన అర్చకులు లక్ష్మీ గణపతిరావు తదితరులు రుద్రాభిషేకం నిర్వహించారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

**పాస్‌పోర్ట్ పోయినది**

★ నేను, సుబ్రాంసు గజేంద్ర మహాపాత్ర R/O K-402, అపర్ణ సైబర్ జోన్, నల్లగండ్ల, హైదరాబాద్, తెలంగాణ-500019 నా పాస్‌పోర్ట్ : S1940491 హైదరాబాద్‌లోని నలగండ్లలోని ఒక దుకాణం దగ్గర పోగొట్టుకున్నాను. దొరికితే క్రింది నంబర్‌లో సంప్రదించండి. మొబైల్: 7093801985. (Ro.No.17328)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

